
# ఇస్కూలు పిలకాయల కత



— నామిని సుబ్రహ్మణ్యం నాయుడు

# అన్న ఎందుకు చదువుకోవాలంటా

రిజర్వేషన్లనేటివి చావా మంచివి. నాకు బలే ఇష్టం.

ఇంటర్మీడియట్‌లో నా చదువు గురించీ, మా ప్రిన్సిపాల్ కొడుకు చదువు గురించీ, ఇంకొక పల్లెరెడ్డి చదువు గురించీ చెప్తా వినండి.

నన్ను ఇంజనీర్‌ను చేసేద్దామని మాయమ్మా నాయినా నన్ను ఎంపీసీలో చేర్పించినారు. దినామూ పది నుంచి నాలుగున్నర దాకా కాలోజీ. మా మిట్టూరు–తిరప్తికి ఆరుమైళ్ల దూరం. చార్జీ వొచ్చి పోను అరవై పైసాలూ, రాను అరవై పైసాలూ. తిరప్తి – యెంగటేస్వర సామి దర్మాన మా వూరి కింత దగ్గిరగా వుండ బట్టే, చార్జీలు సలీసు గాబట్టే నేను కాలోజీ మెట్టెక్కగలిగినా.

ముందు మా బస్సుల గురించి కొంచిం. మా బందుగులంతా చంద్రగిరి రూట్‌లో అంటే పడ మర రాజ్యాన వుండేటోళ్లు. మా వూళ్లల్లో ఏదన్నా కార్యం జరిగితే– మా పరంటు సైడు బందుగులకు చిత్తరెత్తుకునేది – నెత్తిన గుండేసినట్టు.

'రాయల్ చెరువు రోడ్డులో ఆ బస్సులెక్కి ఆ కార్యానికి పొయ్ రావాలంటే ఇవ్వడెట్టరా బగమంతుడా!' అని లబలబా నోరుగొట్టుకునే వోళ్లు. అంత పేరెత్తుకున్నాయి మా రాయల్ చెరువు రూట్ బస్సులు. అవ్వడు – ఇవ్వడు న్నంత మిడిమేలంగా ఆర్టీసీ బస్సులు గూడా లేవు. ప్రైవేటు బస్సులే. కిందా మిందా యేసి జనాల్ని బస్సుల్లో తొక్కేవోళ్లు. నాకు మా మండలంలో వుండే ప్రజలు ముక్యెంగా ఆడోళ్లు అంత 'క్లోజు' అవడానికి కారణం ఈ బస్సు ప్రయాణాలే.

తెల్లారి ఎనిమిది గెంటల్లకు పుస్తకాలూ కేరీరూ ఎత్తుకోని (ఆ రెంటికీ బ్యాగు వుండేది గాదు) మా కోనేటి దగ్గిర నిలబడితే– టాప్ మిందికి ఎక్కదామన్నా మా బస్సులు నిలబడేవిగావు. తొమ్మి దికి ఏదో ఒక వాటంగా బస్సులో అంత తావు దొరికి తొమ్మిదీ ముక్కాలుకంతా రాయల్ చెరువు బస్టాండులో దిగేవాళ్లం. అక్కణ్ణించి మా ఎస్వీ జూనియర్ కాలేజీ – ఎన్ని అడ్డదోవల్లో దూరినా ఒకటిన్నర మైలు. ఫస్టు పీరిడ్డు ఎవ్వడూ ఇరై నిమిషాలు లేటే. మళ్ల, కాలోజీ అయిపొయ్‌నాక ఇల్లు చేరే కొందికి కనాగష్టం ఎంత తక్కువేసుకున్నా ఆరూ ఆరున్నరవతాది.

మాయమ్మ ఎట్టలేదన్నా దినామూ రెండు రూపా యిలన్నా ఇచ్చేది. ఒక్కోసారి ప్రైవేటు బస్సులో – కనీసం వారానికి రెండు మూడు యావతులు టికెటు తీసుకునేవాణ్ణి గాదు. కండక్టరు అడి గితే, బయం బయంగా గొంతులోకి కరుకుదనాన్ని తెచ్చుకుని, 'ఎన్నిసార్లు ఇవ్వాలియ్యా టిక్కెటు? స్టేజీ స్టేజీకి తీసుకోమంటావా ఏంది?' అని కార్వేటి నగరం కండక్టర్‌ని బెదరగొట్టేది. వాడు పాపం, "ఓ ఓ ఆల్రడీ తీసుకునేసినావా?" అనేసి పొయ్యేవోడు. ఈ కుశాలలో ఎస్వీకేఫుకు పొయ్ మసాలా దోసికి ఆర్డరేసేవోణ్ణి. అక్కడా మాంత మైన రష్షు. దోసి తినేసి తేవుకుంటా సైగ్గా వొచ్చేసి

అక్కడా ఎనపై నయాపైసాలు మిగలబెట్టేసే వోణ్ణి. ఇట్లా మిగలబెట్టిన రూపాయా నలబై పైసాలతో మద్యానం పూట ప్రాక్టికల్స్‌కు మూడు నామాలు పెట్టేసి వేరుగా గ్రూవు తియేటర్స్‌కాడికి చేరుకుని, అక్కడ మెట్టుతో కొట్టినట్టు డెబ్బై పైసాలు చెల్లించి టిక్కెటు తీసేవోడిని. తెరకు దగ్గిరగా కాలుమింద కాలేస్కోని సిల్మా చూసి ఇల్లు చేరడం...

లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీలు– అయ్యవార్లు చెప్పిన నోట్ బుక్కులే గతి. ఇంట్లో నోటు పుస్తకాలు తీసిచ్చేవోళ్లేగాని టెక్స్టు పుస్తకాలు తీసి


మ్యమంటే, 'అయ్యవార్లు చెప్పే నోట్ బుక్కులు చాలవంట్రా. మళ్ల అచ్చు పుస్తకాలు గూడా కావాల్నా?' అనేవోళ్లు. దీంతో టెక్స్టు బుక్కు మొకం మాకు తెలవదు.

మా మ్యాథ్స్ లెక్చరర్లిద్దరూ గూడా, 'అమ్మను జేస్తే తమ్ముడు పుడతాడు' అనే నా కొడుకులే వాళ్లు క్లాసు రూములో ఒక్కమాట కూడ ఎగస్ట్రాగా మాట్లాడేవోళ్లు గాదు. 'ఏమన్నా డౌట్లు వుంటే–' అని డ్యాష్ పెట్టేసేవోళ్లు. ఆ డ్యాష్‌ను యెవక బెంచీలో 'ఎట్లా మనం ఫెయిలే' అని తెగించిన ఒక పల్లెటూరి పిలగాడు, 'ట్యూషన్ కొచ్చి అడగండి' అని పొల్లుబోకుండా పూరించేవోడు.

ఇంట్లో, 'నేను ట్యూషన్ జేరతా' అని నేనే ఏ పొద్దూ అన్లేదు. ట్యూషన్లు ఎటువంటోళ్లు చేరతా రంటే– తిరప్తిలో ఎవురి నాయన్లయితే వుజ్జోగాలూ యాపారాలూ చేస్తుంటారో వోళ్ల పిలకాయలు చేర తారు. ఇంకా, ఇంటికాడ పదీ పద్దెదెకరాల

బూమి వుండి పిలకాయల్ని తిరప్తిలో హాస్టళ్లల్లోనో, రూముల్లోనో పెట్టి చదవించేవోళ్లు మాత్రమే ప్రైవేట్లకు పొయ్యేవోళ్లు. మా మాదిరిగా దినామూ వూరినుంచి వచ్చిపొయ్యేవోళ్లు చేరడానికి వీలవనే అవదు.

ఇంగొక పాయింటేమంటే- మా అమ్మా నాయినా సేద్యం గదా చేసేది. నేనెంత కాలేజీకి పొయ్ చదువుకుంటా వుండినా- ఇట్టవుండే వుల్ల అట్ట వెయ్యనంటే కుదరవే కుదరదు. వరి మళ్లో కొంగల్ని మాయమ్మ వొచ్చి తోలాలంటే అవుతుందా? ఎన్ను మింద గువ్వల్ని- పుస్తకం చదువుకుంటానైనా తోల చ్చుగదా. ఉతారుకు శెనిక్కాయల మానూలు కాలమనుకోండి. కొట్టంలో గొడ్లను ఎవురు వొదల్తారు? పరీక్షలకు ప్రిపరేషన్ హాలిడేస్ అని వుంటాయి. అప్పుడు కూడా ఇంట్లోనే పుస్తకం ముందర కుచ్చోని లెక్కలేసుకుంటా వుండలేం.




గొడ్లు 'అంబా' అని అగోరిస్తా వుంటాయి. పైగా పచ్చిక కాలం. పుస్తకాన్ని చేతిలో పెట్టుకుని వాటిని అట్లా మడికాడికి తోలుకుపోయి తిప్పక్కొద్దామనిపిస్తుంది. ఎనుముల్ని విడస్తాను. వాటి మానాన వాటినొదిలేసి నా మానాన నేను త్రికోణమితిని చూసుకుంటా వుంటే అవి పోయి పచ్చని పైర్లో పడి ఏ అత్తో ఒక అత్త, 'నా బట్టా! ఎన మల్ని వోటికొచ్చిన పైరుమింద తోలేసి పుస్తకం పట్టుకోనుండా వంట్రా, నీ దూము గంగమ్మ నిన్ను తగలా!' అని తిడతా కోకెత్తి నా ముకాన వేసేసి వూపిరాడకుండా చేసేసును. వున్నట్టుండి నాలుగు చినుకులు రాలినాయనుకోండి.

మాయమ్మ ఒకటే చెనిక్కాయల్ని వుడ్డదోస్తావుంట నేను ఫిజిక్సు పుస్తకం చేత బట్టుకుని చూస్తా వుంటావా? కాబట్టి ఒకే సగం చదువే, తప్పనే తప్పదు.

అయినా నాకు 73% మార్కులు వచ్చినాయి గ్రూప్పులో. లెక్కల్లో ఇంకా ఇంకా ఎక్కువొచ్చుంటాయి గానీ పేపరిచ్చిన నా కొడుకు ఆ సమ్మచ్చరం - అన్నీ వుదాహరణ లెక్కలే ఇచ్చి చచ్చినాడు. మా లెక్చరర్ నాకొడుకు ఉదాహరణ లెక్కల్ని ట్యూషన్‌లో చెప్తాడే గానీ క్లాసులో చెప్పడు గదా. మాకు కనీసం అచ్చు పుస్తకాలు లేవు గదా.

మా ప్రిన్సిపాలు కొడుకుని గురించి చెప్పాలంటే చానా వుంది. వక్క గొరికినంత సేపట్లో చెప్పకో వాలంటే- వాడు మల్లెపువ్వు మాదిర్తో కాలేజీకి వొచ్చేవోడు. మెట్లు దిగంగానే ఇల్లు. మల్లెపువ్వు మాదిర్తో వున్న వాడు- చింత గింజ వలువులో వున్న బూట్లను టకటకలాడించుకుంటా మా కండ్ల ముందరనే ఇంట్లోకి పొయ్ దూరుకునే వోడు.

అప్పట్నుంచి వోడికి చీమ తలకాయలో మెదడుం-టాది చూడండి అంత పని కూడా వుండదు. ప్రతీ సబ్జెక్టుకూ ట్యూషను. అంతా చేస్తే మా కాలేజీకి వాడే ఫస్టుర్యాంకు. అయినా 81 పర్సెంటే. అంటే 400 మార్కులకు నాకు 292, వాడికి 324. నాకంటే 32 మార్కులు మా ప్రిన్సిపాలు కొడుక్కి ఎక్కువొచ్చినాయి.

ఎంపీసీ గ్రూపు కాబట్టి దింట్లో ఒక చిన్న తమాషా వుంది. ఫిజిక్సులో 20 మార్కులకూ, కెమిస్ట్రీలో 20 మార్కులకూ ప్రాక్టికల్స్ వుంటాయి.




ఫిజిక్సులో వాడికి 20కి 20 వచ్చినాయి. కెమిస్ట్రీలో 20కి 18 వచ్చినాయి. నాకు కెమిస్ట్రీలో అయితే 20కి 18 వచ్చినాయి గానీ ఫిజిక్సులో మాత్రం 9 వచ్చినాయి. ఇక్కడ వాడికీ నాకూ తేడా 11 మార్కులు. ప్రాక్టికల్స్‌లో మార్కులెట్టొస్తాయంటే- ముందు నాకు కెమిస్ట్రీలో 20కి 18 ఎట్టొచ్చినాయో చెప్తితే తెలిసిపోతింది. కెమిస్ట్రీలో ఒక నాయుడు లెక్చరరుగా వుండేవోడు. నేను సుబ్రమణ్యం నాయుణ్ణి అని ఆయనకి తెలుసు. నేను టెస్ట్ ట్యూబ్ నొక దాన్నెత్తుకోని దాంట్లోనుంచి ఒక బేబీని వుట్టించబొయ్యేవోడి మాదిరిగా ఆయన కల్లా సీరియస్‌గా చూసినా. ఆయన నా దగ్గిరికొచ్చి మూడు నిమిషాల్లో అంతా చేసి ఆన్సర్ ఇంత అని చెప్పేసి **పోయినాడు.** అంతే, నాకు 20కి 18 పడిపోయినాయి.

ఇంక ఫిజిక్సులో కూడా నేను వెర్నియర్ కాలిపర్సును చేతబట్టి, దాంట్లో నుంచి చెనిక్కాయల్ని వొలిచేవోడి మాదిరిగా మొకం పెట్టి, 'సా' అని మా ఫిజిక్సు అయ్యోరి కల్లా పొడుగ్గా చూసినా. 'తెలిస్తే చెయ్ వాయ్, తెలీకపోతే పోవాయ్' అని ఆ నాయుడు కాని మా అయ్యోవారు నన్ను కసువుపోచను తీసిపారేసినట్టు పారేసినాడు. ప్రిన్సిపాలు కొడుకు గూడా వెర్నియర్ కాలిపర్సును చేతబట్టుకుని బూట్స్ పాలిష్ చెయ్యబోయినట్టు వాడేదో చెయ్యబోతే ఫిజిక్సు అయ్యవారే చేసి ఇదీ 'ఆన్సరు' అని చెప్పినాడు. కాబట్టి వాడికి అన్యాయంగా వచ్చిన మార్కుల్నీ తీసేస్తే వాడికొచ్చిన మార్కులు 324-11 = 313. నాకంటే వాడికి 21 మార్కులు ఎక్కువ.

ఇంకపోతే మా పల్లెరెడ్డి కూడా నా మాదిరే తూకి నాకం అనే వూరికి పోతా వొస్తా చదువుకునేవోడు.

మాకు ఒకటిన్నర ఎకరా బూమి వుంటే వాడికి మూడెకరాలుండేది. సుమారుగా నా అట్టా బతుకే వాడిది గూడా. పాపం వాడు గూడా ఇస్త్రీ బట్టలూ, బూట్లూ ఏ పొద్దూ యేస్కోనిరాలా. వాడికి 67% వచ్చాయి మార్కులు. మా ప్రిన్సిపాలు కొడుకు పెద్ద మొగలాయిగా తిరప్తిలోనే ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఫస్టుగా సివిల్‌లో చేరిపొయ్యినాడు. నేను కాళ్లీడ్చుకుంటా గోవిందరాజుల డిగ్రీ కాలేజీలో బిఎస్సీ చేరిపొయ్యినాను.

మా పల్లెరెడ్డి ఒకనాడు కనిపిస్తే, 'ఏం రే, రెడ్డీ!




అర్ట్సు కాలేజీలోగానీ చేరినావా?' అనడిగినా.

వాడు నన్ను కొట్టేవోడి మాదిర్తో, 'ఆర్ట్సు కాలోజీలోనా? బిఎస్సీలోనా? నాకేం కర్మరా? నేను బి.టెక్ సివిల్‌లో చేర్నాన్రా!' అన్నాడు వాడు పొడుగ్గా.

'రేయ్, నియ్యా! నాకు జాట్టుగాదురా వుండేది న్రావు. ఇది 1947 గాదురా 77. 73% వచ్చిన నాకే సీటు రాకుంటే 67% కే అదీ సివిల్‌లో సీటొచ్చిందా? ఐకోరటకు పోతాన్రేయ్' అనేసి అన్నా నిరామయంగానే.

'ఒరే చిన్నా! నిజ్జంరా! మేము పల్లిరెడ్లం గదా. పేరుకు రెడ్డే గాని మేం ఎస్టీల మాదిరిగా అనుకో. అదీ కత. అన్నలు ఇంకా తక్కువ పర్సెంటేజొచ్చుండినా నాకు సీటొచ్చుండేది. నా మింద పడి ఏడవకుండా వొచ్చే సారి ఎంట్రన్సుంట రాయి' అనేసి వాడు అదే పాతా...

నిజ్జమే. వోడికి న్యాయమే జరిగింది. లెక్కల్లో ఎంత తమాస జరిగిందో చూడండి. 67% = 81%. యెంగటేస్సర సామి గర్భగుళ్లో అయినా ఇది న్యాయమే. ప్రిన్సిపాలు కొడుకు తెచ్చుకున్న 81% మార్కుల కంటే వీడి 67% మార్కులే ఎక్కువ. పల్లెరెడ్డి నిజ్జంగా ఆ పనీ ఈ పనీ చేస్తానే ఇంటర్ చదువుకున్నాడు.

ఒక రోజు వోడు మద్యానం మంచి కాలోజీ కొచ్చినాడు. 'ఏం రా' అంటే వాడు చెప్పిందిదీ: 'మా నాయినకు ఆ మట్టి పెళ్లల్లో దున్నీ దున్నీ అరికాళ్లు పగిలిపోయ్ అడుగుదీసి అడు గెయ్ లేక కన్నగచాట్లు పడుతున్నాడ్రా. మద్యానం దాకా ఎకరం దున్ని శెనగకి సిద్దం జేసి వొచ్చినా. మడక– ఎద్దు కాళ్లకు పెట్టకుండా దున్నేసొచ్చినాన్రా మచ్చా!' అన్నాడు.

వాడికి 67% కే సివిల్‌లో సీటు రావడం అంటే దేముడున్నట్టే లెక్క. కానీ నాకు సీటు రాకపోవడం మాయమ్మానాయినా నా కొడుకు ఇంజనీరు కాలోజీలో చేర్నాడు అని కులక్కపోవడం మాత్రం దేముడు లేకపోబట్టే.

నేను కమ్మవాణ్ణి అయినా 'అరాతీరా పొండ్లు తోముకునే దానికే తీరకలేదు తల్లా!' అనే అమ్మకు పుట్టినోణ్ణి. ఎకరాలెకరాలుగా బూముల్లేవు. ఇంట్లో అంతకు ముందు ఎవరికీ వుజ్జోగాలు కూడా లేవు.

వొట్టిగా నా కులాన్ని బట్టి నా 73% ప్రిన్సిపాలు కొడుకు 81% కంటే 8% తక్కువైపొయ్యింది.

కులాన్ని బట్టే గాక వాళ్ల స్తితుల్ని బట్టి కూడా ఈ రిజర్వేషన్లు వుంటే ఎంత బాగుండును!

పోనీ, ఆ మాత్రం రిజర్వేషన్లు వుండబట్టయినా పల్లెరెడ్డి 67% ప్రిన్సిపాలు కొడుకు 81% సమానమైనందుకన్నా సంతోషిద్దాం.

నా వరకు నాకు ఈ రిజర్వేషన్ల పిచ్చి ఎంత ఇదంటే– ఇవి డబ్బులో గూడా వుంటే ఎంత బాగుండుననిపిస్తుంది. అది ఎట్లనో ఇలాన రిగా చెప్తా. న్యాయమో అన్యాయమో, అసలిట్లా ఎందుకుండగూడదో మీరే చెబ్దురు గానీ––

మా వూరి మాదిగపల్లిలో చిగురువాడామె అని ఒకామె వుండాది. ఆమె అసలు పేరేందో తెల్దు. ఆమె మా వూరికి నాలుగుమైళ్ల కావక్కమండే చిగురువాడ మంచి అడ బతకలేక– ఈడ బతకదామని మా వూరి మాదిగ పల్లెలో చేరింది. అందుకని ఆమెకు చిగురువాడామె అని పేరొచ్చింది.

ఆమె కిప్పుడు డెబ్బైయ్యేండ్లుంటాయి. మొగుడెప్పుడో చచ్చిపొయినాడు.

కొడుకులూ కూతుండ్లూ వుండారు గానీ వాళ్లూ వాళ్ల పిలకాయలూ– వాళ్లు పొట్టబోసుకునేదే గగనం. ఈమె నోట్లోకి ఎవరూ అంత తెచ్చి పెట్టరు. ముసిలోళ్లకు వచ్చే పింఛనీ నెలకు 90 రూపాయలొస్తాదేమో అని ఆశపడి 'ఎమ్మారావు' ఆఫీసు చుట్టూతా తిరిగి చాలుకునింది. ఇంక ఏ దోవా లేక కూలికి పొయ్యే పని బెట్టుకునింది.

చిగురువాడామెకి వొణుకుడు రోగం కూడా చెయ్యి వూరికే వుండినా వొణకతా వుంటింది పల్లెటూళ్లల్లో రకరకాల సీజన్లలో ఆడోళ్లు చేసే పనులు ఏముంటాయంటే–

మడక పోతా వుంటే చాలులో బిత్తెడు కొక గింజ లెక్కన వేరుశెనగ పొన్న వెయ్యడం; వేరుశెనగ పైరులో తొలిక చేతబట్టి కసువుసు తొవ్వడం; వరిపైరు నాటడం;

వరి మళ్లో కలుపు తియ్యడం; లేదంటే చెరుకు నాటడం, చెరుకుతోట తొవ్వడం, వరిమడి కొయ్యడం... ఇట్టా పనులు తెల్లారి ఎనిమిది మంచి సందేళ ఆరుదాకా చేస్తే ఇప్పటి రేట్ల ప్రకారం దినానికి 15 రూపాయిలిస్తారు.

చిగురువాడామె కూలికి వస్తానంటిందేగాని దాన్ని కూలికి పెట్టుకునే వున్నోళ్లుదెవరు? తోస్తే తొంబై య్యామడలు పడేటట్టుంటాది. కయ్య గెనిమిల మింద కూడా కుదురుగా నడవ లేందు. అరిచేతిలో సంగటి ముద్దేస్తే తుంచుకోని తుంచుకోని తినడమే కష్టం. అట్టాంటి మనిషి తొలిక చేతబట్టి వేరు శెనగ తొవ్వాటానికి దిగితే తొలికి చెట్టుమిందికి పొయ్ దాని వేరు తెగిపోతిందే గానీ పచ్చిక మీదికి పోలేందు.

వూళ్లో రైతులంతా తిట్టి తిట్టి చాలుకునేసి, 'అట్టా చావనీ!' అనుకునేసినారు. పదిమందిలో ఒకదానిగా వొస్తాది. ఇంకేం అన్లేక 'నువ్వు తొవ్వా వొద్దు, ఏం వొద్దు. వూరికే అట్ట కూచ్చే తల్లీ!' అనేసినారు కడకు. కూడా వొచ్చిన కూలోళ్ల తమాస మాటలు మాట్లాడుకునేదానికి మాత్రం పనికొస్తింది.

'ఏమే చిగురోడా! నీ మొగుడు ఎప్పుడన్నా నిన్ను ఎట్ట చేసేవోడా?' అని ఒకామె అనిందనుకో, దానికి చిగురువాడది నవ్వా గివ్వా లేకుండా,

'ఇప్పుడు మీ మొగుళ్లు మిమ్మల్ని చేసేపట్టే లెండే నా నవ్వుతులాలా!' అంటింది వొణకతా.

అందరికీ నవ్వు. అట్టా కష్టం దెలనకుండా నక్క వాయిద్యమై పొయ్యింది చిగురువాడామె. ఏదో ఒక మనిషి గింటలో చేసే పనిని పొగులంతా ఆ ఎండలో పడి అంగలార్చుతా వుంటింది. లేదూ అరవైయ్యేండ్ల వాయసులో బాగానే కూడా పని చేసిందనుకుందాం. సందేళకు ఆమె చేతిలో పది రూపాయలు పడతాది.

ఇప్పుడామె చేతిలో ఎంతుందీ– పది గదా! ఆ పదీ ఎత్తుకుని చిగురువాడామె నేరుగా అంగిడికొచ్చింది. అక్కడికి మా వూళ్లోనే వున్న ఒక ఎన్జీఓ గూడా... లేదా వాడి పెళ్లాం గూడా అంగిడికొచ్చిందనుకుందాం. ఆ ఎన్జీఓ జీతం నెలకి ఆయిదువేలనుకుందాం. అతనికి వుద్యోగమే గాకుండా యెనకాన నాలుగెకరాల బూమి గూడా వుందానుకుందాం. ఆ ఎన్జీఓను కొంచెం 'తినమరిగి' అనుకుందాం. మాలోళ్లకీ, మాదిగోళ్లకీ, ఇల్లోళ్లకీ, ఇంకా కుంటోళ్లకీ గుడ్డోళ్లకీ, ఏ లోనొచ్చినా మారో ఇమ్మారో తీసుకోందే వాడు ఆ లోన్ వాళ్లకిప్పడనుకుందాం. సుమారుగా వాడి పైఆదాయం నెలకు అయిదువేలనుకుందాం. ఇందాకా వాడూ, ఆ చిగురువాడామె అంగిడికి చేరుకున్నారు గదా.

ఇద్దరూ చెరొక కేజీ బియ్యం తీసుకుందారను కుందాం. కేజీ బియ్యం పదిరూపాయలనుకుంటే– ఆ ఇద్దరికీ చెరొక కేజీ బియ్యం వస్తాయి.

అంటే, ఇక్కడ మాదిగ చిగురువాడామె చేతిలో పదీ ఈజ్ ఈక్వల్ టు తినమరిగి చేతిలో పది?

చిగురువాడామె రూ. 10 = 10 రూ. తినమరిగిదీ.

ఆ డబ్బూ ఈ డబ్బూ ఇక్కడ సమానమైపొయ్యింది. ఎంత దరిద్రంగా వుందో లెక్క!

చిగురువాడామెకి సొంతాస్తి అంటూ ఏమీ లేదు. దున్ని బతకడానికి బూమి గానీ దూకి చావడానికి బావి గానీ లేదు. పైగా 70 ఏండ్ల వొయిసులో కూడా కష్టం చేసుకునే మనిషి. ఆమె అంత కష్టపడి సంపాయించిందీ, తినమరిగికి పుక్కసంగా వొచ్చిందీ– రెంటికీ ఒకటే విలువై పొయ్యింది.

అంగడివాడి దగ్గిరికి తినమరిగి రాంగానే 'నీ గుర్తింపు కార్డు ఇట్ట చూపించు' అన్నాడనుకుందాం. అంగడి వాడు తినమరిగి గుర్తింపు కార్డునూ, అందులో వున్న వాడి ఆదాయాన్నీ చూసి,

'అయ్యా! నీకు కేజీ బియ్యం– ఏడు వేలా ఆరువందలా ఎనభై మూడు రూపాయిలా యనభై




ఎనిమిది పైసాలు. అంత రేటుకు అమ్మమని మాకు గవర్నమెంటు ఆర్డరు' అని అన్నాడను కోండి. అప్పుడు వాడు ఎంత దుడ్డూ దుగ్గాణీ సంపాయించినా వుప్పూ మిరపకాయకే చాల్దు.

మన చిగురువాడామె గుర్తింపు కార్డును చూపిం చినప్పుడు, 'అమ్మా! నీ. పదికి మూడు మూటల బియ్యం, రెండు చాటల వుప్పూ, ఒక మూట మిరక్కాయలూ వొస్తాయి. నీ కొడుకును ఎద్దల బండి తీసుకోని రమ్మను, సరుకును తీసకపోదు వుగానీ-' అని అంగడివాడు అంటే...

మన ముఖ్యమంత్రి పెళ్లామూ, నా పెళ్లామూ ఇద్దరూ బజారుకు పాయినారు. నా పెళ్లాం మా ఆదాయానికి తగినట్టుగా గుర్తింపు కార్డు చూపించి పావలాకు ఎక్కాల పుస్తకం కొనుక్కోని బిడ్డకు తెచ్చిస్తింది. అదే ముఖ్యమంత్రి భార్యకు ఎక్కాల పుస్తకాన్ని కొనాలంటే పన్నెండు లక్షలా 87 వేలా 964 రూపాయిలు పెట్టాల్సొస్తుంది.

ఈ రేట్లు చూసి చూసీ ముఖ్యమంత్రి అమ్మ, 'ఎందుకురా! ఈ ముఖ్యమంత్రిగా వుండి కోట్లు పెట్టి బియ్యం కొని చట్టిలో వేసుకుని నువ్వు – నీ పెళ్లాం బిడ్డల్ని సాక్కోలేవు. పైగా అందరి నోళ్లల్లో నానేదేమిటికి? సుకంగా మన వూరు వొచ్చి – ముఖ్యమంత్రిగా వున్నా అదే తిండి, అదే బతుకు, వూళ్లో మడక దున్నుకున్నా అదే తిండి, అదే బతుకు! వూళ్లో పచ్చని చెట్ల మధ్య ఎంత బాగుంటాది! ఎందుకీ పెట్రోలు పొగల్లో...'. అనేసి కొడుకుని హాయిగా సేద్యం చేసుకోమంటుంది.


అంటే ఎనుములు మేపేవోడూ, సేద్యం చేసుకునేవోడూ, బాగా గడ్డివామి వేసేవోడు, ఇంజనీరుప్లాను వేసి ఏడంతస్తుల బిల్డింగు కట్టేవోడూ– అందురూ ఒకే రకంగా బతక గలిగేటట్టుంటే...

అట్ట లేదే! నా వరకు నాకు ఎనుముల్ని మేపడమంటే బలే ఇష్టం. ఏడో తరగతి పాసై ఇస్కూలు మళ్లీ ఓపను కాంగానే నేమూ మా వాయినా ఒకటై పోయినాం.

'పెద్దోడు కార్వేటి నగరంలో టీచరు ట్రయి నింగు చేసినాడు. మళ్లా సిన్నబ్బ గూడా చదవాల్నా? సేద్యానికి పనికొస్తాళ్లే' అని చూసినాడు మా వాయిన.

అంతే, నేను ఇస్కూలుకు పోకుండా, ఆ టయానికి ఎనుముల్ని విడిచిపెట్టేసినాను.

మాయమ్మ, 'వొద్దు కొడకా. మా యమ్మా వాయినా మమ్మల చదివించక ఎండలో ఈ మాల కష్టం చేస్తుండాము. నువ్వంత కష్టం చెయ్యలేవు. పియ్యి దినో పిడక లేరో నువ్వు చదివితే చదివిస్తాం. యెయ్యి రూపాయల సంబళంలో కుదురుకున్నా వంటే నువ్వు సుకంగా బతికి పోతావు' అని బుద్ధి మాటలు చెప్పి మాయమ్మ ఎనిమిదో తరగతికి పంపించింది.



అట్ట గాకుండా శెనిగితోట పెరికేవోడూ, నీడవ మూర్తీ జిల్లాను ఏలే కలెక్టరూ... ఇద్దరూ ఒకే స్తోమతతో బతకతా వున్నారనుకో. అప్పుడు మాయమ్మ ఒకవేళ నేను 'చదవాల కావాల' అని పట్టుబట్టినా, 'ఎందుకురా తండ్రీ. ఆ ఇంగిలీసు నువ్వు కంతతా పెట్టలేవు. ఆ కన్న కనమాలమంతా చదివితే నీకు సందేశయితే తలకాయి నెప్పి వొచ్చే స్తింది. ఏమా గాచ్చారం? హాయిగా గొడ్లు మేపుకో. ఒకేశ చదివి కలెక్టరయి ఆ వూరుగాని వూర్లో కార్లో తిరగలా అంత అగచాట్లు పడినా– ఇక్కడ ఎండలో హాయిగా కన్నవాళ్ల కంటి ముందర ఎను ములు మేపుకున్నా అంతా ఆ యమ్మే గదా. అందరిపీ మట్టి పొయ్యిలే గదా' అని మాయమ్మ నన్ను ఇస్కూలుకు సిలిపేసి వుండేది.

నేను శెనగ చెట్టు పెరికితే నాకొచ్చే పది రూపా యలూ– కలెక్టరు చేతిలో వుండే పది రూపాయలూ, ముఖ్యమంత్రి చేతిలో వుండే పది రూపాయలూ అందరిపీ ఒకే విలువ గాబట్టి మాయమ్మ నన్ను చదవెయ్యాలనుకునింది.

ప్రపంచంలో ఇప్పుడు– ఎట్టయితే చదువుల్లో ప్రిన్సిపాలు కొడుకు మార్కులు 81% = పల్లెరెడ్డి 67% మార్కులు • సమానమైనాయో – అట్ట, చిగురువాడామె చేతి పది రూపాయలు = ముఖ్య మంత్రి చేతి కోటీ పజ్జెనిమిది లక్షలు కాలేదు గాబట్టే, పిలకాయల్ని అందరూ చదవేస్తున్నారు.

ఎస్.సీలూ, ఎస్.టీలూ కూడా చదువుకుంటేనే ఈ సౌకర్యమైనా. డబ్బులో మాత్రం వాళ్లగ్గూడా రిజర్వేషను లేదు.

నాకొడుకూ నేనూ ఒకసారి రైల్వే టేసను మంచి తిరప్తి రేడియో టేసిని దాకా రిక్సా ఎక్కినాం. దిగినాక రిక్సా ఆయనకు ఎనిమిది రూపాయలిచ్చినాను.

అప్పట్నుంచి నా కొడుకుతో నేను, 'రేయ్ పెద్ద




యివాక ఏం చేస్తావురా?' అవంటే వాడు,

'హాయిగా టింగ్ టింగ్ అంటూ రిక్సా తొక్కతా. రైలు టేసిన్నించి రేడీ టేసివికి తొక్కవావంటే ఎయిట్ రూపీస్ ఇస్తారు. దాంతో హాయిగా అన్నీ కొమక్కునేస్తా...' అన్నాడు.

వాడు రిక్సా తొక్కి దివానికి ఎవ్వై రూపాయలు సంపాయించివా వాడు– వాడి పెళ్లాం బిడ్డల్ను సాక్కోలేడనీ, హాయిగా బతక లేడనీ మవం తెలుసుకున్నాం గదా.

కాబట్టే వాణ్ణి తినమరిగి ఏడీఓ గావో, బిడ్డని నెప్పి తగలనివ్వకుండా ట్యూషన్లు పెట్టించి చదివించుకున్న ప్రిన్సిపాలు గావో, కలెక్టర్నుగావో, లేదా ముఖ్యమంత్రిగావో చేసేద్దామని, అట్ట చేస్తేగానీ సుకంగా బతకడవే దీంతో వాణ్ణి ఎట్టయినా చదివించాలని చూస్తా.

ఇట్లనే, అందురు తల్లిదండ్రులు కూడా.

మవ బిడ్డలు విజ్ఞాన ఖనులై పోవాలని కాదు చదివించేది. ఏ ఆటో ఒక ఆట ఆడి బాగా సంపాయించి అన్ని రకాలుగా బాగా బతకాలని, రెక్కల కష్టం చెయ్యకూడదని.

ఇందుకోసరమనే అందురూ చదువుకోవాలి. వాడెవుడో ఒకడు 'చదువురాని వాడు వింత పశువు' అని అన్నాడని గాదు.

------- బతికినంత కాలం నేను మావూళ్లోనే వుండిపోవాలనుకున్నా. నేను తిరప్తి–రేణిగుంట రోడ్డులో వుండే ఆంధ్రజ్యోతిలో పనిచేసేవోణ్ణి. మా వూరికీ ఆపీసుకీ రెండు బస్సులు మారి వచ్చిపోతా వున్నాను.

1991లో మాయమ్మ చచ్చిపొయ్యింది. అయినా 1994 దాకా వూళ్లోనే వుండినా. '94 కంతా నాకూతురు రెండో తరగతిలో చేరాల్సొచ్చింది. నా కొడుకు ఎల్‌కేజీలో చేరాల.

నా భార్య కూడా, 'తిరప్తిలో కాపరం పెడదాం. పిలకాయల్ని బాగా చదివించుకుందాం' అని శత పోరేదానికి పెట్టుకునింది.

ఇంతలో మా అక్క కూతురు కూడా ఏడు పాసై ఎనిమిదిలోకి వచ్చేటట్టయ్యింది. మా వూరి అయిస్కూలిని నమ్మితే– ఇంక ఆ అమ్మికతా, మాదిగ చిగరువాడామె కతా ఒకటే అవతాదని బయపడి–– నేను పిలకాయల్ని బాగా చదివించుకుందామని చెప్పి కాపరాన్ని తిరప్తి బైరాగివట్టెడకి మార్చినా.

(ఇంకా వుండాది)

# పువ్వులే ఇంటికి అందం


ప్రకృతి అందమంతా పువ్వులే. రంగు రంగుల గులాబీలు, మందారాలు, చేమంతులు మవానవలతో మవమువి దోచే మల్లెలు, విరజాజులు, నంపెంగలూ...ఇంతేనా! పువ్వుల దాకా ఎందుకు? మనోహర వర్ణాలతో కనువిందు చేసే ఆకులున్న కెలిడియం, కోలియస్, డ్రసీనా, డైఫిన్, బాళియా వంటి మొక్కలు లలితంగా సుందరంగా వుండి 'ఆకులందమా! పువ్వులందమా!' తేల్చుకోలేనని బెగోనియాలు, ప్రకృతి ఇచ్చిన సంపదలా అనిపిస్తాయి. ఇవన్నీ తీరుగా ఇంట్లో అన్ని మూలలా అలంకరిస్తే!...

పుష్పాలంకరణలో జపాన్ వాళ్ళని మించిన వాళ్ళు లేరు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన 'ఇకేబనా ఆర్ట్' జపానీయుల సంప్రదాయ కళ. వారి పారంపర్యపు ఆస్తి. ఇకెనోబో, జప్రా, సోగెట్సూ స్కూళ్ళలో ఈ ఆర్ట్ నేర్చుకోవచ్చు. కాన్వొకేషన్ ఉత్సవాల్లో మనకు డిగ్రీలు ప్రదానం చేసినట్టు, ఈ స్కూళ్ళలో కూడా ఈ కళలో నిష్ణాతులైన వాళ్ళకు ఓ ప్రత్యేకమైన పువ్వు పేరు సొంతంగా ఇచ్చేస్తారు. ఇంక ఆ పేరు





ఆ వ్యక్తి సొంతమన్న మాట. దాన్ని వాళ్ళు దాదాపు ఇంటి పేరులాగా వాడుకుంటారు. ఇక పోతే ఈ ఇకేబనా ఆర్ట్‌కి జపాన్ వాళ్ళు ఇంకా మెరుగులు దిద్దారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అందమైన పువ్వులతో ప్రాంతీయంగా దొరికే ఆకులు, లతలు, కొమ్మల్ని కలిపి అచ్చం జీవం వున్న శిల్పంలా ఆ పువ్వుల్ని అమర్చటం. ఈ ఫొటోల్లో వున్న పువ్వుల అమరికను గమనిస్తే ఈ విషయం అవగతమవుతుంది. ఇలా పువ్వుల్ని అమర్చి ఇంట్లో ఏ మూల వుంచినా చాలు. ఇల్లు వేయి అందాలతో మెరిసిపోదూ!



—కావ్య